## క్లుప్తంగా

### తెనాలిలో కోటి దీపారాధన



**తెనాలిటౌన్:** పట్టణ బాలాజీరావుపేటలోని పట్టాభిరామస్వామి దేవస్థానంలో శనివారం కార్తీకమాసం సందర్భంగా కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో కోటి దీపారాధన నిర్వహించారు. అర్చకులు వేదాంతం నాగమారుతి, భక్తులు దీపాలను వెలిగించి పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మల్లీశ్వరి, గాయత్రి, భక్తులు పాల్గొన్నారు.

### వైకుంఠపురం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కాటేపల్లి మృతి



**తెనాలిఅర్బన్:** తెనాలి పట్టణ మాజీ కౌన్సిలర్, వైకుంఠపురం దేవస్థాన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కాటేపల్లి ఆదినారాయణ (77) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గంగానమ్మపేటలోని ఆయన నివాసానికి వెళ్ళారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కౌన్సిలర్‌గా, దేవస్థాన చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు బూరెల దుర్గా, అక్కిదాసు కిరణ్ కుమార్, స్థానిక నాయకులు ఉన్నారు.

### రేపు తెనాలిలో సత్యాగ్రహ దీక్ష



**తెనాలిఅర్బన్:** అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తెనాలిలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బషీర్ తెలిపారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శనివారం బాధితులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల్లో కొంత మందిని ఇప్పటికే ఆదుకోవడం జరిగిందన్నారు. మిగిలిన వారిని కూడా ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బి.కృష్ణ పాల్గొన్నారు.

### వీనులవిందుగా సినీ సంగీత విభావరి



**పాత గుంటూరు:** అమరావతి రోడ్డు అన్నదాన సమాజం వేదికగా నవ కళోదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. పలు చిత్రాల్లోని పాటల్ని గాయకులు టి. సుధీర్, ఘన శ్యామాచారి, వై. సుబ్బారావు, బాబూరావు, పత్రి గాయత్రీదేవి, చింతా రజని ఆలపించారు. వీరికి కీబోర్డుపై రవి, తబలాపై వెంకట్, ప్యాడ్స్‌పై సురేష్ వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ అధ్యక్షుడు పి.యల్.యన్.మూర్తి కళాకారుల్ని సత్కరించారు. కార్యక్రమంలో బిల్లా అశోక్, వెంకాయమ్మ పాల్గొన్నారు.

### బాలుడి ఆత్మహత్య

**గుంటూరు ఈస్ట్:** బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనారాయణపురానికి చెందిన జొన్నాడ రాము కుమారుడు అంజి (15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చదువులో వెనుకబడడంతో మానసికంగా కుంగిపోయి శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఉద్యోగం ఇప్పిస్తానని మోసం**

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 6/3లో వెబ్‌ల్యాబ్ టెక్నాలజీస్ కన్సల్టెన్సీని సునీల్‌కుమార్ నిర్వహిస్తున్నాడు. రాజేష్‌కుమార్ ఉద్యోగం కోసం అతడ్ని కలిశాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రాజేష్‌కుమార్ వద్ద రూ. 3 లక్షలు తీసుకుని ఇప్పించలేదు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లోక్‌అదాలత్‌లో ఇరుపక్షాలకు మేలు

**తెనాలిరూరల్:** కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదికని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని న్యాయమూర్తులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు కేపీ బాలాజీ, ఎం. శ్రీధర్, పి. రాజశేఖర్, జె. శ్రీసత మాట్లాడుతూ ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కానీ కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 34 సివిల్, 180 క్రిమినల్, ఐదు రోడ్డు ప్రమాద కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ. 1,31, 73, 864 పరిహారం కింద అందించారు. అదాలత్ సభ్యులు కేవీఎల్ ప్రభావతి, పి.రమేష్, కె. చంద్రశేఖర్, ఖాదర్ హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. వేణుగోపాలరావు, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

## కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు

**తెనాలిఅర్బన్:** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ తెనాలిశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారం కొనసాగింది. ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎస్.సుధాకరరావు, ఐమళ్ళ రాజేష్ ఖన్నా, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

## కలెవరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



**తెనాలిటౌన్:** మండలంలోని కలెవరం గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలని అధికారులు ప్రజలను కోరారు. వివిధ శాఖల అధికారులు మాట్లాడారు. సమావేశంలో హౌసింగ్ డీఈ రఫీ, ఏఈ శ్రీనివాస్, పీఆర్ ఏఇ వెంకటేశ్వరరావు, కొలకలూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దిలీప్, ఏపీఎం జయశ్రీ, పంచాయతీ కార్యదర్శులు జి.సుభాష్ చంద్రబోస్, జె.వినయ్‌బాబు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి కృషి

**తెనాలిఅర్బన్:** ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ఎంతో కృషి చేస్తుందని ఆ సంఘ తెనాలి యూనిట్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ తెనాలి యూనిట్ కార్యవర్గ సమావేశాన్ని శనివారం తెనాలి జిల్లా వైద్యశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన సరండర్, మెడికల్ లీవ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. పీఆర్‌సీకి సంబంధించిన ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యదర్శి కె.సౌజన్య, ట్రెజరర్ జి.విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు డి.సుధీర్ బాబు, ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీనివాసరావు

## వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించండి



**తెనాలిఅర్బన్:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పాటుపడుతుందని 18వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ గౌస్య పేర్కొన్నారు. 18వ వార్డు ఇస్లాంపేటలో రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరం అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి బుక్‌లెట్‌లను పంపిణీ చేసి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ అన్సారీ, బిలాల్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లతో సమయం, డబ్బు ఆదా

- సీనియర్ జడ్జి వై. నాగరాజ
- 228 కేసులు పరిష్కారం
- కక్షిదారులకు రూ 3.30 కోట్ల పరిహారం చెల్లింపు

**మంగళగిరి:** లోక్ ఆదాలత్‌లను వినియోగించుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై. నాగరాజ తెలిపారు. నగరంలోని కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. రికార్డు స్థాయిలో మొత్తం 228 కేసులు పరిష్కారం కాగా రూ. 3.30 కోట్లు నగదు చెల్లింపులు జరగడం విశేషం. ఏడీఎం కోర్టులో 220 కేసులు, సబ్ కోర్టులో 16 కేసులు, పీడీఎం కోర్టులో 12 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసుల్ని లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమని కక్షిదారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వి. రామకృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి. శ్రీ ప్రత్యూష, ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీనివాసరావు, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు దొడ్డక బ్రహ్మానందం, వేమూరి రత్నప్రసాద్, జొన్నాదుల లెనిన్‌బాబు, బ్యాంక్ న్యాయవాదులు వి. రామ్‌గోపాల్ గౌడ్ , ఎల్. శివరామ్ ప్రసాద్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న సీనియర్ జడ్జి నాగరాజ తదితరులు

## నగరంలో పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ

**మంగళగిరి:** నగరంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి రోజు వార్డుల్లో నిరంతరం పర్యటిస్తున్నారు. పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో డెప్యూటీ కమిషనర్ శనివారం వార్డుల్లో పర్యటించారు. శ్రీనివాసమహల్ పక్కన స్థానికుడు గౌస్ తమకు తాగునీరు రావడం లేదని తెలపడంతో వెంటనే స్పందించిన అధికారులు ఇంజనీరింగ్ సిబ్బందిని పిలిచారు. సమస్యను పరిష్కరించి తాగునీటిని సరఫరా చేయడంతో గౌస్ ఆనందం వ్యక్తం చేసి అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమలో పారిశుద్ధ్య అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య సమస్యలు తెలుసుకుంటున్న డెప్యూటీ కమిషనర్ బి. శివారెడ్డి

## 'ఆడుదాం.. ఆంధ్రా'కు మైదానాల పరిశీలన



**మంగళగిరి:** ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలకు నగరంలో 12 మైదానాలను గుర్తించినట్లు కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. నగరంలో పలు మైదానాలను శనివారం పరిశీలించారు. పోటీలకు సన్నద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఆయా మైదానాల్లో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీకే హైస్కూలు మైదానాల్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి. శివారెడ్డి, సెక్రటరీ పి. శ్రీనివాసరావు, డీఈ కృష్ణారెడ్డి, పట్టణ ప్రణాళికా సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన ఆయుర్వేద వైద్య శిబిరం

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని కీర్తి ఎస్టేట్స్‌లో శనివారం సురక్ష అకాడమి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూర్ణ రాజేశ్వరి మాట్లాడుతూ ధన్వంతరి జయంతి సందర్భంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్సతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశామని చెప్పారు. శిబిరంలో సీనియర్ ఆయుర్వేద వైద్యులు, ప్రముఖ పంచకర్మ స్పెషలిస్ట్, నాడీ వైద్య నిపుణులు సేవల్ని అందించారని వివరించారు.



శిబిరంలో వైద్య సేవలు అందించిన డాక్టర్లు, సిబ్బంది

## క్రమశిక్షణతో కూడిన చదువుతో ఉన్నతస్థాయి

**గుంటూరు ఎడ్యుకేషన్:** క్రమశిక్షణతో కూడిన చదువుతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని మేఘాలయ రాష్ట్ర సహకార, పశుసంవర్ధక, కార్మికశాఖ పూర్వపు ముఖ్య కార్యదర్శి జి. హరిప్రసాదరాజు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హరిప్రసాదరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, భవిష్యత్తును నిర్దేశించుకుని ముందుకు వెళ్లేందుకు ముఖ్యమైనదని తెలిపారు. ఓఎన్‌జీసీ పూర్వ జనరల్ మేనేజర్ డాక్టర్ దేశిరాజు వీఆర్ మూర్తి మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా తన ఉన్నతికి హిందూ కళాశాల ఎంతో దోహదపడిందని చెప్పారు. ఆంధ్ర రంజీ ట్రోఫీ మాజీ క్రీడాకారుడు డీవీ సుబ్బారావు మాట్లాడుతూ హిందూ కళాశాల క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందని, విద్యార్థి దశలో తాము చదువుతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనేవారిమని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం సహాయ, సహకారాల్ని అందిస్తోందని తెలిపారు. ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులకు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడంలో పూర్వ విద్యార్థులు ప్రేరణగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల విశ్రాంత అధ్యాపకులైన దత్త ప్రసాద్, డాక్టర్ కె. సుబ్రహ్మణ్య శాస్త్రి, కె. ప్రభాకర్‌ను సత్కరించారు. ప్రతిభ గల విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ప్రకటించిన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మాజేటి సోమశేఖరరావు, కేవీఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ గౌరీ శంకర్, ఎన్. సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



హరిప్రసాదరాజును సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, పూర్వ విద్యార్థులు

## నేటి నుంచి పుస్తక మహోత్సవం

**పాత గుంటూరు:** విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లోని ఏఈఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఈ నెల10వ తేదీ నుంచి 31 వరకు 23వ పుస్తక మహోత్సవం (పుస్తక ప్రదర్శన) ఏర్పాటు చేసినట్లు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, బుక్ హౌస్ మేనేజర్ మురకొండ మల్లికార్జునరావు తెలిపారు. బుక్ హౌస్‌లో శనివారం విలేకరుల సమావేశంలో శివ ప్రసాద్ మాట్లాడుతూ 10న సాయంత్రం 5 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో 20 వేల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆర్.కె. నారాయణ్, కుష్వంత్ సింగ్, మహాత్మాగాంధీ, నెహ్రూ రచనలతో పాటు గురజాడ, శ్రీశ్రీ వంటి ప్రఖ్యాత రచయితల రచనలు, ఆధ్యాత్మిక, వాస్తు శాస్త్ర గ్రంథాలయాలతో పాటు, వైద్య, ఆరోగ్య, పాపులర్ సైన్స్ గ్రంథాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. విద్యార్థుల కోసం అన్ని రకాల కాంపిటేటివ్, గ్రామర్, రిఫరెన్స్ బుక్స్, తెలుగు అకాడమీ టెక్ట్స్ బుక్స్,100 రకాల డిక్షనరీలు కూడా ఉంటాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ప్రదర్శనను పుస్తక ప్రియులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. అరసం ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ఆవిష్కరణలు, పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు జరుగుతాయని వారు వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వల్లూరి శివ ప్రసాద్, మల్లికార్జునరావు

## దళిత సంఘాల ఆందోళన



**పొన్నూరు:** పొన్నూరు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఓ వ్యక్తి అవమానించడంపై దళిత సంఘాలు, జై భీమ్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మెట్ల పైభాగంలో ఒక వ్యక్తి మద్యం మత్తులో హల్ చల్ చేశాడు. వెంటనే పట్టణ పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. డీఎస్పీ జనార్దనరావు, అర్బన్ సీఐ అల్తాఫ్ హుస్సేన్ ఘటనా స్థలానికి చేరుకుని, సంఘాల నాయకులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

**తెనాలిఅర్బన్:** అనారోగ్యంతో బాధపడుతున్న తెనాలి 37వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆవులమంద శాండీకి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రూ.25వేలను వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం చేశారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే శివకుమార్ తన అనుచరులను శాండీ ఇంటికి పంపారు. శాండీని ఫోన్‌లో ఆయన పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే పంపిన రూ.25వేల నగదును వైఎస్సార్‌సీపీ నాయకులు శాండీకి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, మల్లెబోయిన రాము, అత్తోట చంటి, సన్నీ, డానియేల్, హనీఫ్, థామస్, తదితరులు పాల్గొన్నారు.



శాండీకి నగదును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

**కొల్లిపర:** లబ్ధిదారులు జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల హౌసింగ్ ఏఈ సుబ్బారావు సూచించారు. శనివారం మండలంలో పలు గ్రామాలల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఏఈ పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం 2024 ఫిబ్రవరి మొదటి వారంలో సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపట్టనుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మొత్తం 2300 ఇళ్లు మంజూరు కాగా 930 పూర్తయ్యాయని, మరో 580 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. మండలంలో జనవరి 31 నాటికి 398 మంది ఇంటి పూర్తి చేసే విధంగా సచివాలయం ఇంజినీర్ అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలకు వెలుగు పథకంలో ఉన్న మహిళా సభ్యులు బ్యాంకుల ద్వారా రూ.35,000 రుణాన్ని పొందవచ్చన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణస్థాయి ఆధారంగా ఎస్టీ, ఎస్సీ లబ్ధిదారులకు ఉన్నతి స్కీం ద్వారా రూ.50,000 రుణం అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

## ఘనంగా కార్తిక వనసమారాధన



వనసమారాధనలో పాల్గొన్న అధికారులు, నాయీబ్రాహ్మణ సంఘీయులు

**తెనాలిటౌన్:** పట్టణంలోని చినరావూరు పార్కు దగ్గర గల నూకల రామ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో శనివారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. సంఘానికి చెందిన చిన్నారులు వివిధ నృత్య ప్రదర్శనలు చేశారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సంఘ నాయకులు పాల్గొన్నారు. వన సమారాధనలో ఐఏఎస్ అధికారి బి.రామారావు, మెడికల్ బోర్డు సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎం.సురేంద్రబాబు, డీఎస్పీ పి.మల్లికార్జునరావు, అగ్రికల్చర్ ఆఫీసర్ కె.వెంకట్రావు, సంఘ నాయకులు కొడాలి సుబ్రమణ్యం, కంభంపాటి శివలింగ ప్రసాద్, ఐనంపూడి శివలింగప్రసాద్, చందర్లపాటి సూర్యవెంకటేష్, గండికోట రాజా రమేష్, అద్దంకి శ్రీనివాసరావు, తాడివలస దామోదరరావు, మాచవరపు సుబ్రమణ్యం, మున్నంగి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు హక్కులు ఎంతో కీలకం

**గుంటూరు ఎడ్యుకేషన్:** మానవ మనుగడకు రాజ్యాంగం కల్పించిన హక్కులు ఎంతో కీలకమని జిల్లా కోర్టు పూర్వపు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాస్ పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనో వికాస కేంద్రంలో శనివారం ఎంఎస్ఐ, అంధేరీ హిల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా గృహ కార్మికులతో ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాళిదాస్ మాట్లాడుతూ మానవ హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు సమాజంపై ఉందని తెలిపారు. భూమిపై పుట్టిన ప్రతి మనిషికి స్వతంత్రంగా జీవించేందుకు కొన్ని హక్కులు ఉంటాయన్నారు. జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ తదితర కారణాలతో వివక్ష లేని జీవనం గడపాలని సూచించారు. ప్రైవేటు సంస్థలు, గృహాల్లో పని చేయించుకునే కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉందని, హక్కులకు భంగం వాటిల్లినప్పుడు కోర్టుల ద్వారా న్యాయం పొందాలని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించే హక్కును పొందాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రిన్సిపాల్ సిస్టర్ ఐడా, కో-ఆర్డినేటర్లు జి. అనురాధ, సిస్టర్ వ్యాకుల మేరీ, 150 మంది గృహ కార్మికులు పాల్గొన్నారు.



గృహ కార్మిక మహిళలతో కట్టా కాళిదాస్, సిస్టర్ వ్యాకుల మేరీ

## నేడు ములుకుదురులో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ

**బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మురళీకృష్ణ**

**కొరిటెపాడు(గుంటూరు):** దృష్టి లోపం సమస్య మాత్రమే కాదని, మనిషికీ-ప్రపంచానికీ మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని పటాపంచలు చేసే దిశగా బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి పేరిట నిర్విరామ కృషి చేస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పొన్నూరు మండలం ములుకుదురులో ఈ నెల 3న బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరంలో అవసరమైన 912 మందికి కళ్లజోళ్లను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. ములుకుదురు మెయిన్ రోడ్డులోని పాత వాటర్ ప్లాంటు వద్ద ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని వెల్లడించారు. బజరంగ్ నేత్రజ్యోతి శిబిరంలో కళ్లజోళ్ల ఆవశ్యకతను గుర్తించబడిన వారు అందుబాటులో ఉండి, వాటిని పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.